కథ

మృగరాజు వారు ఓ రోజు మామూలుగా దిన పత్రిక తిరగేస్తున్నాడు. రాజా వారి కళ్లు ఓ పేజీలో ఓ చోట ఆగిపోయాయి. జానా బెత్తెడు గుడ్డలతో వయ్యారాలు పోతూ హొయలు ఒలకబోస్తోంది ఓ బొంబాయి దిగుమతి గుంట. నోరు తిరగని పేరామెది. కింద ఇంటర్వ్యూ. ముందుస్తుగా ఆమె నటిస్తున్న సినీమా...షూటింగ్ ఎక్కడో ఆ వివరాలూ, చదువూ సంధ్యా, హైదరాబాద్ ఎన్ని సార్లు వచ్చింది? ఇవన్నీ ఇంటర్వ్యూలో ప్రశ్నలు సంధించి రాబట్టిన సమాధానాలు వరుసగా ఇస్తున్నారు. ఎన్నో సార్లు ఈ అందాల హైదరాబాద్ వచ్చానంది ఆ అమ్మడు. ఇక్కడ షూటింగ్ అంటే ఇంట్లో వున్న ఫీలింగ్ అంది. ఇక్కడి ప్రజలు ఎంతో మంచివారు. బోల్డు కోపరేట్ చేస్తారంది. ఫలానా తెలుగు హీరోతో నటించడం తన కల అనీ, ఇప్పుడా కల తీరిందని ఎంతో ఇదిగా చెప్పింది.

# తిండి గోల

– బాలి

చివరగా వేసిన ప్రశ్న ఇది. ''ఇంకా ఏమేమీ ఇష్టం? హైదరాబాద్ బిర్యానీ తిన్నారా?'' అని తిండిగోల ప్రశ్న వేశాడు ఇంటర్వ్యూకారుడు.

''అబ్బా! ఎంతిష్టమో చెప్పలేను. అదంటే పడి ఛస్తాను. నోట్లో వేసుకుంటే ఇట్టే కరిగిపోతుంది'' అన్నదామె.

ఇంటర్వ్యూ అయిపోయింది.

ఇంటర్వ్యూ చదివిన మృగరాజా వారి నోట్లో నీళ్లూరాయి. ఆ పేపరు మడిచి పక్కన పెట్టి మరో పేపరందుకున్నాడు మృగ రాజులవారు.

అందులోనూ మూడవ పేజీలో ఇలాంటిదే మరో ఇంటర్వ్యూ వుంది. అయితే ఈమె బొంబాయి భామ కాదు. ఇటలీ పాప. ఓయాలో ఏదో పని మీద వచ్చి పనిలో పనిగా హైదరాబాద్ చుట్టబెడుతూ ఇంటర్వ్యూ కారుడికి దొరికిపోయింది.

ఆమె పేరేమిటో, ఏ దేశమో కనుక్కోని ఈ అందాల హైదరాబాద్ ఇంకా అందంగా వుందా? అని ప్రశ్నించి ఇంత స్నేహపూర్వకమయిన వాతావరణమూ, ఇంత ఆప్యాయత చూపించే మనుషులూ ఎక్కడా కానరాలేదన్న జవాబు రాబట్టి ''హైదరాబాద్ బిర్యానీని తిన్నారా? మీ నోట్లో కరిగిపోయిందా?'' అనడిగాడు.

''అమ్మో! నోట్లో వేస్తూనే కరిగిపోయింది. ఆ హోటల్‌లోని వంటవాడిని అడిగాను. నాతో ఇటలీ వచ్చేస్తావా? అని. అంత బాగుందివావ్'' అందా భామ.



నవ్వు(ముగింపు)


మృగరాజు నోట్లో చెంబుడు నీళ్లూరాయి. హైదరాబాద్‌లో వుంటూ ఇలాంటి మధురమైన బిర్యానీని ఒక్కమారన్నా తినలేకపోయానేమిటా అని తనలో తానే తిట్టుకుంటూ ఏదో చప్పుడయితే వెనక్కి తిరిగి చూశాడు.

మూషికరావు పళ్లరసం పట్టుకొచ్చాడు. ''అయ్యా!'' అన్నాడు వినయంగా....

పేపర్ మడిచి పక్కన పడేస్తూ, ''నాకీ రోజు ఈ పళ్ల రసాలు, గిళ్ల రసాలూ తాగాలని లేదు. ఇప్పటికే నా పళ్లలో నుంచి బిర్యానీ గురించి ఆలోచించీ, ఆలోచించీ లొట్టల రసం కారుతోంది. అన్నట్లు నోట్లో వేసుకుంటే కరిగిపోయే బిర్యానీ గురించి నీకేమయినా తెలుసా'' అనడిగాడు.

''లేదు రాజా లేదు. నాకసలు దాని గురించి ఏ మాత్రం తెలీదు'' అని వినయంగా మూషికరావు వెళ్లిపోయాడు.

సాయంత్రం తోటలో వేడి వేడి ఇరానీఛాయ్ తాగుతూ తన అంతరంగిక చెలికాడు మేకపోతు రాజుని అడిగాడు.



''చెలికాడా! నిన్నో విషయం అడగాలి. మన హైదరాబాద్‌లో పాట్ బిర్యానీ అనీ, ప్లేట్ బిర్యానీ అని వున్నాయట. మళ్లీ అందులో వెజిటబుల్ బిర్యానీ అనీ, చికెన్ బిర్యానీ అనీ వున్నాయట! ఇందులో ఏం తిన్నా ఐస్‌క్రీం బయట గాల్లో కరిగిపోయినట్లు, ఇవి నోట్లో వేసుకుంటే చాలు కరిగిపోతాయట. ప్రతి పేపర్‌లోనూ ఇదే గోల. నేనీ ఊళ్లో వుండి కూడా తినకపోవడం ఇన్‌సల్ట్‌గా వుంది. అదెక్కడ దొరుకుతుందో? ధర ఎంతో కనుక్కుని చెప్పాలి.''

మేకపోతురాజు అప్పటికే పోపు తగిలించి, నిమ్మరసం పిండిన పనీర్ పోహళింపు తింటూ ''అయ్యా- ఈ పోహళింపు కన్నా గొప్ప వంటకం వుంటుందా? అవన్నీ మీడియాలు చేసే ప్రచారం'' అని కొట్టిపారేశాడు.

తన అంతరంగిక చెలికాడు తన కోర్కెను ఇంత తేలిగ్గా కొట్టి పారేయ్యడం మృగరాజుకి నచ్చలేదు. తరువాత ఏం మాట్లాడాలో అంతకన్నా తట్టలేదు. అయితే వేడి టీ తాగినా నోట్లోంచి వచ్చే నీళ్లాగడం లేదు. బుర్ర నిండా ఆలోచనలు. ఆ ఆలోచనల నిండా హైదరాబాద్ బిర్యానీయే! మృగరాజు అటు ఇటూ తిరగడం మొదలుపెట్టాడు. చీకటి పడే వేళకి భల్లూక మహర్షి వచ్చాడు. మృగరాజు మనసు లేచి వచ్చింది. అప్పటికి జరిగినదంతా మహర్షికి వల్లించి ''నోట్లో వేసుకుంటే కరిగిపోతుందట, ఈ హైదరాబాద్‌లో వుండి కూడా....''

భల్లూక మహర్షి విరగబడి నవ్వి, ''రాజా! మీ బాధను నేను అర్థం చేసుకున్నాను. ఏ దిక్కుమాలిన హోటల్లోకెళ్లినా ఆ వంటకమే కనపడుతుంది. దానికే వంద పేర్లు పెట్టి, గిన్నెల్లోనూ, కుండల్లోనూ, ఆకుల్లోనూ పెట్టి అమ్ముతారు. అదంతా పబ్లిసిటీ స్టంట్. నోట్లో వేస్తే కరగదు. ఎక్కువ తింటే అరగదు. చల్లారితే తినలేం. కొండకచో నెయ్యి వేసామని బుకాయించి డాల్డా అని నమ్మబలికి గొడ్డు కొవ్వు కలిపి వడ్డిస్తాడు. రాజా! అంతదాకా ఎందుకు? మన గజగమని వుందిగా- అది బ్రహ్మాండంగా చేస్తుంది. శుభ్రమైన దినుసులు అందిస్తే-నోట్లో వేసుకొనే దాకా ఎందుకు? చేతితో ముట్టుకొంటనే చాలు వెన్నలా కరిగిపోయి నోటి దాకా వచ్చేసరికి నేల మీద పడికారిపోయి- ఇంతలో మన మనసు అదోలా అయిపోయి నేల మీద పడి మనమూ నాకవలసి వస్తుంది''అన్నాడు.

మృగరాజు ఆశ్చర్యంగా నోరెళ్ల బెట్టాడు. పెదాలకు ఆ చివర ఈ చివర నీళ్లు కారడం మొదలుపెట్టాయి. ఆ పక్కన కుదేలయ్య ఇదంతా విన్నాడు.

''అమ్మ దొంగల్లారా!గజగామిని చేత బిర్యానీ వండించి ఈ మృగరాజున్నూ, ఈ భల్లూక మహర్షీ తినేద్దామనుకుంటున్నారు కాబోలు. గజగామిని రుచిగా చేసిందంటే ఇంకేమన్నా వుందా? రోజూ బిర్యానీయే! అసలే గజగామిని మహా సున్నితం. ఆమె చేత ఎలాగన్నా ఒప్పించాలి తాను చేయనని. అయితే నా మాట వినదే! దీనికి ఒకటే మార్గం. ముందు తోడేలేశ్వరరావు చేత చెప్పించాలి. వాడి మాట వింటుంది.'' అనుకుంటూ తోడేలేశ్వరరావు దగ్గరకు పరుగుతీసింది.


ఆ క్షణంలో తోడేలేశ్వరరావు ఛాయ్ తాగుతున్నాడు. అతడి చిట్టి ఫ్రెండ్ అడవి పిల్లేశ్వరరావు చెట్టుకు ఆనుకొని ఐస్‌క్రీం తింటున్నాడు.

''అయ్యా తోడేలేశ్వరరావు గారూ ఇది విన్నారా? అంటూ మృగరాజు తిండిగోల, భల్లూకమహర్షి సలహాలూ'' తూచ తప్పకుండా చెప్పింది. అన్నీ విన్న జంబూకేశ్వరరావుకి చిర్రెత్తుకొచ్చింది.

''గజగామిని వండుతుంది. మృగరాజు మింగుతాడు. మనకెందుకీ మధ్యలో గోల?'' అన్నాడు.

''అయ్యో! జంబూకేశ్వరా!! ఇంతేనా నీ తెలివితేటలు- మనమందరం ఈ హైదరాబాద్‌లో వుంటున్నాం. పైగా దగ్గర దగ్గరగానే వుంటూ ఒకరి విషయాలు మరొకరం తెలుసుకోకపోతే ఎలా? కష్టాలుంటాయి. సుఖాలు వుంటాయి.'' కుదేలయ్య మెల్లగా నచ్చజెప్పే ధోరణిలో అన్నాడు.

''చూడు కుదేలయ్యా! ఏదో పేపరోళ్లు రాశారని మన మృగరాజు బిర్యానీ మీద మనసు పారేసుకొని చొంగకార్చుకోవడం అన్యాయం. ఈ తిండిగోల ఇంటర్వ్యూలో ఓ ఐటం అయిపోయింది. బిర్యానీలో మరాఠీ మొగ్గ, జాపత్రి, సోంపూ ఇంత తగిలిస్తే ఎలాంటి వాడికన్నా ఇంకా ఇంకా తినాలన్న ఆశ చచ్చి ముఖం మొత్తుతుంది.''అతి సర్వత్రా వర్జయేత్'' అన్న మాట



వినలేదూ. సరేపద. గజగామిని ఎలా వండుతుందో- మృగరాజు నోట్లో నీళ్లకు ఎలా ఆనకట్ట పడుతుందో చూద్దాం'' అని బయలుదేరాడు.

కుదేలయ్యకు తన ప్రయత్నం పారినందుకు ఆనందం వేసింది.



ఇద్దరూ రోడ్డు దిగి రాళ్ల గుట్టలు దగ్గరకు వచ్చి ఎదురుగా వున్న గుట్ట వైపు చూశారో లేదో ఖంగుతిన్నారు. భల్లూక మహర్షి ఏదో తింటూ గజగామినితో మాట్లాడుతున్నాడు. గజగామినికి మృగరాజు గారి తిండిగోల చెప్పాడు కాబోలు- అప్పుడే వంట మొదలుపెట్టింది. వీరిద్దరూ ఆగిపోయారు.

''చూశావా కుదేలయ్యా... హైదరాబాద్ పాట్ బిర్యానీ వండడం మొదలయ్యిందన్న మాట. ఇక వారి తిప్పలేవో వారు పడతారు. అయినా ఆ మృగరాజుకి సిగ్గులేదు. ఏదో పేపర్లో చూసి హైదరాబాద్ బిర్యానీ అంత బాగుంటుందా? ఇంత బాగుంటుందా? అని చొంగకార్చడమేనా? అయినా ఈ పేపరోళ్లు ఆలోచించాలి. తిండి గోల గురించి, సిన్మాభామల్ని, విదేశీ పాపల్ని ప్రశ్నించే ముందు మీ దేశంలో గానీ, మీ నగరంలో గానీ బస్సుల్లో ప్రయాణిస్తూ ప్రజలు ఎంత నరకం అనుభవిస్తున్నారు? రోడ్డు మీద అంతంత నిలువు గోతుల్ని చూశారా? ప్రభుత్వ ఆఫీసుకెళ్లి ఓ కాయితం తెచ్చుకోవడానికి లంచగొండితనంతో చేతులు తడపాలా? మీ నాయకులు సక్రమంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారా? మనిషికి కావలసిన కనీస అవసరాలు చదువూ, ఆరోగ్యమూ అందుతున్నాయా? ఇలాంటివి అడిగి సమాధానాలు రాబట్టాలి గానీ ఈ తిండిగోల కాదు.'' మెల్లగా అన్నాడు.



''అవునవును'' కుదేలయ్య తలూపాడు.

ఇద్దరూ వెనుతిరిగారు. గజగామిని వంటకం ఘాటు వారి ముక్కుపుటాలకి తాకింది. తిండిగోల మొదలయ్యిందని ఇద్దరూ అనుకున్నారు.

★



ఫరాన్ అఖ్తర్

## 'డాన్'పై పోని మమకారం

కొన్ని సినిమాలు హిట్టయినా కాకపోయినా ఆ దర్శకులకు మాత్రం వాటిపై మమకారం పోదు. ఆ ఇతివృత్తాన్ని అంత తొందరగా వదులుకోబుద్ధి కాదు. బాలీవుడ్ దర్శకుడు ఫరాన్ అఖ్తర్ తన గత చిత్రం 'డాన్' పైనా అలాగే మమకారాన్ని వదులుకోలేకపోతున్నట్లున్నాడు. ఇప్పుడు దానికి రెండో భాగం తీయాలని ఉత్సాహపడుతున్నాడు. దీని తొలి భాగం 2006లో విడుదలైంది. షారుక్ ఖాన్ హీరోగా విడుదలైన ఈ చిత్రం ముప్ఫయ్యేళ్ళ క్రితం అమితాబ్ బచ్చన్ నటించిన 'డాన్' చిత్రానికి రీమేక్. ఇది పెద్దగా విజయవంతం కాలేదు. అయినా ఇప్పుడు ఫరాన్ 'డాన్-2' ను నిర్మించాలని అనుకొంటున్నాడు. ఇందులోనూ షారుక్ ఖానే హీరోగా నటిస్తాడట. అయితే మొదటి చిత్రంలో లాగానే హీరోయిన్ ప్రియాంకా చోప్రానా మారుతుందా అనేది తేల్చి చెప్పలేదు. ప్రస్తుతం ఫరాన్ అఖ్తర్ 'రాక్ ఆన్' అనే సంగీత ప్రధానమైన చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటి వరకూ కెమెరా వెనుక దర్శకుని పాత్రనే పోషించిన అతనికి ఇదే నటుడిగా కెమెరా ముందు తొలి అనుభవం.

